'స్కందమాత'గా భ్రమరాంబికాదేవి

ఐనవోలు, అక్టోబర్ 7: ఐనవోలు మల్లికార్జునస్వామి దేవాలయంలో భ్రమరాంబికాదేవి సోమవారం 'స్కందమాత' అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు పాతర్లపాటి రవీందర్, విక్రాంత్ వినాయక్ జోషి ప్రత్యేక పూజలు చేశారు. చండీహోమ పూజల్లో ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

లలిత మహా త్రిపురసుందరిగా రుద్రేశ్వరీదేవి

హనుమకొండ చౌరస్తా : వేయి స్తంభాల రుద్రేశ్వరాలయంలో అమ్మవారిని శ్రీలలిత మహా త్రిపుర సుందరిగా అలంకరించి పూజలు చేశారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి–నీలిమ దంపతులతో రుద్రేశ్వరీదేవి లక్ష పుష్పార్చన, అనంతరం వాహనసేవ నిర్వర్తించినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. ఆలయ ఈవో వెంకటయ్య ఉత్సవ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పద్మాక్షి అమ్మవారికి లక్ష పుష్పార్చన

హనుమకొండ: హనుమకొండ హనుమద్గిరి పద్మాక్షి అమ్మవారికి నవకలాభిషేకం, శ్రీ సూక్తంతో అభిషేకం, వేద పారాయణం, చండీ హోమం నిర్వహించినట్లు ఆలయ ఆస్థాన వేద పండితుడు నాగిళ్ల షణ్ముక పద్మనాభ అవధాని, నాగిళ్ల శంకర్‌శర్మ తెలిపారు. అనంతరం 100 కిలోల పూలతో లక్ష పుష్పార్చన చేశారు.

స్కందమాతగా అలంకరణ

పద్మాక్షి అమ్మవారు

హనుమకొండ చౌరస్తా : రుద్రేశ్వరీదేవి లక్షపుష్పార్చన చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

బ్యాంకింగ్ సేవల్లో ఆలస్యం చేయొద్దు

తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ, అక్టోబర్ 7: బ్యాంకింగ్ సేవల్లో ఆలస్యం లేకుండా త్వరగా అందించాలని తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సూచించారు. సోమవారం నక్కలగుట్టలోని వరంగల్ జిల్లా సహకార కేంద్ర ప్రధాన కార్యాలయంలో డీసీసీ బ్యాంక్ మేనేజర్లు, సీఈవోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా బ్యాంకు రూ.2వేల కోట్ల టర్నోవర్ సాధించిన సందర్భంగా బ్యాంక్ సిబ్బందితో కలిసి మార్నేని కేక్ కట్ చేశారు. 2024లో రుణమాఫీ ద్వారా లబ్ధి పొందిన రైతులకు కొత్త పంట రుణాలు ఇవ్వాలన్నారు. అలాగే అర్హత గల రైతులకు సంబంధించి ఇన్వాలిడ్ ఆధార్ ఉన్న ఎర్రర్‌ను ప్రభుత్వ అనుమతితో సరియైన ఆధార్ కాపీలను సమర్పించి రైతులకు లబ్ధి చేకూరేలా చేయాలని సూచించారు. అర్హులైన రైతుల రుణాలను ప్రభుత్వానికి సమర్పించడంలో అలసత్వం ప్రదర్శించిన సంఘాల సిబ్బందిని బాధ్యులను చేయాలని సీఈవోలను ఆదేశించారు. సమావేశంలో సీఈవో వజీర్ సుల్తాన్, జీఎం ఉషా, డీజీఎం అశోక్, ఏజీఎంలు మధు, స్రవంతి, కృష్ణ మోహన్, రాజునాయక్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మార్నేని రవీందర్‌రావు

డాల్ఫిన్ హాస్పిటల్ ఎదుట ఆందోళన

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 7 : హనుమకొండలోని డాల్ఫిన్ హాస్పిటల్‌లో వరుస మరణాలపై ప్రజలు మండిపడుతున్నారు. ఇటీవల ఒకరు మృతి చెందిన ఘటన మరువకముందే సోమవారం హాస్పిటల్‌లో మరో బాలిక మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే బాలిక మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ హాస్పిటల్ ఎదుట ఆందోళనకు దిగారు. ములుగు జిల్లా పత్తిపల్లికి చెందిన రక్షిత జ్వరంతో బాధపడుతుండగా డాల్ఫిన్ హాస్పిటల్‌కు తీసుకురాగా వైద్యులు పరీక్షలు చేశారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ బాలిక మృతి చెందింది. కాగా, హాస్పిటల్ ఎదుట బైఠాయించిన విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులను శాంతింపజేసే ప్రయత్నం చేసినప్పటికీ వారు వినిపించుకోకుండా హాస్పిటల్‌లోని కుండీలను పగలగొట్టారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వైద్యులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు

క్లాత్ బ్యాగులను వినియోగించాలి

కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, అక్టోబర్ 7 : పర్యావరణ హితానికి క్లాత్ బ్యాగులను వినియోగించాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో మెప్మా ఆధ్వర్యంలో తయారు చేసిన క్లాత్ బ్యాగులను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ బాటిళ్ల నియంత్రణకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్వో వైవీ గణేశ్, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేశ్, నారాయణ, మెప్మా అధికారి రజితారాణి పాల్గొన్నారు.

ఆలస్యం చేయకుండా అర్జీలు పరిష్కరించాలి

కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు వచ్చిన దరఖాస్తులను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు వివిధ సమస్యలపై మొత్తం 79 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. రెవెన్యూ సమస్యలపై 45, జీడబ్ల్యూఎంసీవి 8, వ్యవసాయ శాఖ 8, ఎంపీడీవో ఆఫీసులు 5, డీపీవోకు సంబంధించి 3, మిగిలినవి ఇతర శాఖలకు చెందిన దరఖాస్తులు ఉన్నాయి.

మెప్మా ఆధ్వర్యంలో తయారు చేసిన క్లాత్ బ్యాగులను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

బుక్‌లెట్ ఆవిష్కరించిన కలెక్టర్

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో అందిస్తున్న వైద్య సేవల వివరాలతో బుక్‌లెట్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించి ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ పథకంలో అందించే శస్త్ర చికిత్సలు, థెరపీల వివరాలను కలిగిన బుక్‌లెట్‌ను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. డీఎంహెచ్‌వో లలితాదేవి పాల్గొన్నారు.

రైతు భరోసా ఇవ్వాలని కలెక్టర్‌కు వినతి

ఎల్కతుర్తి : రైతుభరోసా కింద రూ. 15వేలు, ప్రతి కుటుంబానికి రూ. 2లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని కోరుతూ రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో రైతులకు రైతుభరోసా ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు, జిల్లా అధ్యక్షుడు హింగె భాస్కర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఉద్యాన శాఖ అధికారి

హనుమకొండ : జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ నూతన అధికారి వెంకటేశం కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పలు విషయాలపై చర్చించారు.

జీడీఎస్‌ల సమస్యలు పరిష్కరించాలి

కేంద్ర సహాయ మంత్రికి ఏఐజీడీఎస్ జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు వినతి

హనుమకొండ, అక్టోబర్ 7 : గ్రామీణ తపాలా ఉద్యోగులకు కనీస వేతనం, కమలేశ్ చంద్ర కమిటీ అనుకూల సిఫారసులను అమలు చేయాలని కోరుతూ కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు వినతిపత్రం అందజేశారు. విజయవాడలో మంత్రి క్యాంప్ కార్యాలయంలో కలిసి సమస్యలను వివరించారు. గ్రామీణ తపాలా ఉద్యోగులు మెడికల్, కనీస పెన్షన్ సౌకర్యం లేదని, గామీణ ప్రాంతాల్లో ఇళ్లల్లో నిర్వహిస్తున్న పోస్టాఫీస్‌లకు ఇంటి అద్దె, న్యాయమైన అలవెన్స్ లేదని పేర్కొన్నారు. పేరుకు 5 పని గంటలతో నియమించగా, రోజుకు 8 నుంచి 10గంటల పాటు పనిచేయాల్సి వస్తోందని, గ్రామీణ తపాలా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే దిశగా ఆలోచించాలని కోరారు. దేశంలోని మూడు లక్షల మంది గ్రామీణ తపాలా ఉద్యోగులకు న్యాయం జరిగే దిశగా ఆలోచించాలన్నారు. ఏఐజీడీఎస్‌యూ తెలంగాణ అసిస్టెంట్ సర్కిల్ సెక్రటరీ పెరుమాండ్ల తిరుపతి, హనుమకొండ డివిజన్ కోశాధికారి బాపూజీ, మర్రి కొమురారెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐజీడీఎస్ జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

హనుమకొండలో కుక్కల బెడద

హనుమకొండ, అక్టోబర్ 7: హనుమకొండలో కుక్కల బెడద రోజురోజుకూ పెరిగి స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. బాలసముద్రం, నక్కలగుట్ట, కేఎల్ఎన్‌రెడ్డి కాలనీ, ఎక్సైజ్‌కాలనీ, వడ్డేపల్లి, రెవెన్యూ కాలనీ, రామకృష్ణాకాలనీ, ప్రగతినగర్ కాలనీల్లో కుక్కలు గుంపులుగా స్వైరవిహారం చేస్తుండడంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఇప్పటికే కుక్కలు దాడి చేయడంతో కొందరు ప్రాణాలు సైతం కోల్పోయిన ఘటనలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా కార్పొరేషన్, జిల్లా యంత్రాంగం పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకొని కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బాలసముద్రంలో రోడ్డుపై ఉన్న కుక్కలు

అందుబాటులో యూరియా

దామెర, అక్టోబర్ 7 : మండలంలోని ఊరుగొండ పెద్దాపురం పీఏసీఎస్ కార్యాలయంలో రైతుల కోసం యూరియా అందుబాటులో ఉంచామని పీఏసీఎస్ చైర్మన్ బొల్లు రాజు సోమవారం తెలిపారు. పంటలకు వేసేందుకు ఎంతమేరకు అవసరం ఉంటుందో అంత యూరియాను పీఏసీఎస్ ద్వారా అందిస్తామన్నారు. యూరియా కావాల్సిన రైతులు తమ ఆధార్ కార్డు జిరాక్స్‌ను కార్యాలయ సీఈవో శ్రీనివాస్‌కు అందించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

పిడుగుపాటు మృతుల కుటుంబాలకు పరామర్శ

ఐనవోలు, అక్టోబర్ 7 : మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన దౌతుబాజీ శ్రావణి(17), కూకట్ల రాజు(24) ఆదివారం సాయంత్రం పిడుగు పాటుతో మృతి చెందారు. కాగా, సోమవారం స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మృతదేహాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మృతదేహాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య ఉన్నారు.

రాజు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కడియం

శ్రావణి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

నీటి నిల్వల సంరక్షణ అందరి బాధ్యత

కాజీపేట, అక్టోబర్ 7 : నీటి నిల్వల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని విశ్రాంత జిల్లా అటవీ శాఖ అధికారి, యునైటెడ్ ఫోరం ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం అన్నారు. జాతీయ వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా సోమవారం యునైటెడ్ ఫోరం ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్, ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ, జన విజ్ఞాన వేదిక, వన సేవా సొసైటీ ఆధ్వర్యంలో వడ్డేపల్లి చెరువుకట్టపై చెరువుల పరిరక్షణ, ప్లాస్టిక్ నిరోధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంతకు ముందు వాకర్స్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి కరపత్రాలు పంపిణీ చేసి, కట్ట పరిసరాల్లో ప్లాస్టిక్ ఏరివేశారు. సామాజిక సేవకుడు పొన్నాల రామ్మోహన్, ఔల్స్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్, నాగేశ్వర్‌రావు, జన విజ్ఞాన వేదిక బాధ్యుడు రాములు, వందన, కుమారస్వామి, పర్యావరణ ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి శ్రవన్‌కుమార్, కోశాధికారి సుధాకరస్వామి, రాజ్‌కుమార్, జీవవైవిధ్య మండలి జిల్లా కో ఆర్డినేటర్ లక్ష్మి పాల్గొన్నారు.

వడ్డేపల్లి చెరువుకట్టపై అవగాహన కల్పిస్తున్న పురుషోత్తం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, అక్టోబర్ 7 : హనుమకొండ టౌన్ పరిధిలో పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ ఆపరేషన్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనుల వల్ల ఆర్ఈసీ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దర్గా, హౌసింగ్‌బోర్డు కాలనీ, బియాబానీనగర్, గాంధీనగర్, బీజేపీ క్వార్టర్స్, అలాగే కలెక్టరేట్ సబ్ స్టేషన్ పరిధిలోని ఆర్ట్స్ కాలేజీ చుట్టుపక్కల, జూలైవాడ, సుబేదారి ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

దుర్గా మాతను దర్శించుకున్న సీపీ

కాజీపేట, అక్టోబర్ 7 : పట్టణంలోని శివాలయంలో శివశక్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 26వ సారి ఏర్పాటు చేసిన దుర్గామాతను సోమవారం రాత్రి వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. 180 రకాల కూరగాయలతో అలంకరించిన శాకంబరీ అమ్మవారికి పూజారి అయినవోలు ప్రవీణ్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మిట్టపల్లి రవీందర్, రంజిత్, నాగబెల్లి శ్రీధర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీపీ కుటుంబ సభ్యులకు చిత్రపటం అందజేస్తున్న పూజారి అయినవోలు ప్రవీణ్‌శర్మ

కర్ణాకర్‌కు జాతీయ ప్రతిభా పురస్కార్

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 7 : రామప్ప జూనియర్ కాలేజీ కరస్పాండెంట్, సెక్రటరీ ఐలి కర్ణాకర్‌ను 2024 సంవత్సరానికి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేసినట్లు దక్షిణ రాష్ట్రాల ప్రైవేట్ లెక్చరర్స్ ఆర్గనైజేషన్ గౌరవాధ్యక్షుడు లక్ష్మణరావు, రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య తెలిపారు. ఈ నెల 20న గుంటూరులో జరిగే కార్యక్రమంలో అవార్డును అందజేస్తారని చెప్పారు.

ఐలి కర్ణాకర్

రోడ్డు ప్రమాదాలపై జాగ్రత్తలు తీసుకోవాలి

హసన్‌పర్తి, అక్టోబర్ 7 : తెలంగాణలో అతిపెద్ద పండుగలు బతుకమ్మ, దసరా సమీపిస్తున్నందున రహదారులు వాహనాలు, పాదాచారులతో రద్దీగా ఉంటాయని, ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్ట్ అధికారి పుప్పాల శ్రీనివాస్ కోరారు. మద్యం, మత్తు పానీయాలు తాగి వాహనాలను నడపొద్దని, ఓవర్ స్పీడ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దన్నారు. బైక్ నడిపేటప్పుడు హెల్మెట్, కార్లలో సీట్‌బెల్ట్ ధరించాలన్నారు.

సద్దుల బతుకమ్మ ఏర్పాట్ల పరిశీలన

కమలాపూర్, అక్టోబర్ 7 : మండల కేంద్రంలోని పెద్దచెరువు వద్ద సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను మండల అధికారులు సోమవారం పరిశీలించారు. దసరా, బతుకమ్మ ఉత్సవాలకు ఇబ్బందులు కల్గకుండా చెరువు కట్టపై శుభ్రం చేయాలని సూచించారు. విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎంపీడీవో బాబు, సీఐ హరికృష్ణ, ఆర్ఐలు శ్రీనివాస్, సమ్మయ్య, కార్యదర్శి రమణారెడ్డి, నాయకులు రమేశ్, సమ్మయ్య పాల్గొన్నారు.

కమలాపూర్ పెద్దచెరువు వద్ద బతుకమ్మ ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ నడుంకట్టాలి

శాయంపేట, అక్టోబర్ 7 : మండలంలోని గట్లకానిపర్తి గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు నడుంకట్టాలని గ్రామస్తులు సోమవారం నిర్ణయించారు. ఈ మేరకు గ్రామంలో సమావేశం నిర్వహించారు. గ్రామ పెద్దలు, యువజన సంఘాల నాయకులు, కుల పెద్దల అభిప్రాయాలు సేకరించారు. గ్రామ అభివృద్ధికి కమిటీని వేయాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు. గ్రామానికి వైకుంఠ రథం సమకూర్చుకోవాలని, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్మశాన వాటిక దగ్గర, వివిధ సెంటర్ల వద్ద సీసీ కెమెరాలు, గ్రంథాలయం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ బొమ్మకంటి సాంబయ్య, గుర్రం అశోక్, బత్తిని సత్యం, వైనాల కుమారస్వామి, బుస్స సంపత్, బొమ్మకంటి రాజేందర్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ బదిలీలపై ఉత్కంఠ

- రాత్రి వరకు జారీకాని ఉత్తర్వులు
- ఆందోళనలో అధికారులు, ఉద్యోగులు

హనుమకొండ, అక్టోబర్ 7 : విద్యుత్ శాఖలో బదిలీలపై ఉత్కంఠ నెలకొంది. టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం సోమవారం బదిలీ ఉత్తర్వులు జారీ చేసి 9వ తేదీలోగా రిలీవ్ అయి విధుల్లో చేరాల్సి ఉంది. కానీ కార్పొరేషన్, సర్కిల్, డివిజన్ స్థాయిలో బదిలీల విషయంలో స్పష్టత లేకపోవడంతో రాత్రి వరకూ ఉత్తర్వులు జారీ కాలేదు. యూనియన్ల నాయకుల మధ్య సైతం అనిశ్చితి ఉందనే ప్రచారం సాగుతోంది. ప్రధాన పోస్టులు, ఫోకల్ పోస్టుల సాధించుకొనే క్రమంలో నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని పలువురు చర్చించుకున్నారు. అర్ధరాత్రి వరకు సైతం బదిలీ ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో అధికారులు, ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలు బదిలీలు అవుతాయో? కావో? అనే సందిగ్ధ పరిస్థితి నెలకొందని గుసగుసలాడుకుంటున్నారు. జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్న యాజమాన్యం మాత్రం బదిలీలను హోల్డ్‌లో పెట్టాలని మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు ఒకవైపు ప్రచారం సాగుతుండగా, అధికారులు మాత్రం ఏ రాత్రి వరకైనా బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తామని చెప్పడం కొసమెరుపు. కాగా, ఒకవేళ బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తే 9వ తేదీలోగా రిలీవ్ అయి విధుల్లో చేరే గడువును దసరా పండగ నేపథ్యంలో 14వ తేదీ వరకు పొడిగించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE

★కాకతీయ యూనివర్సిటీ దగ్గర్లో, Reliance Smart Pointకి సమీపంలో నెలకు 25K Rents వచ్చే North East Facingలో గల G+1 ఇల్లు (221 Sq.yds) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 8639002604.
NTW-326343

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

ముగ్గురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

సుబేదారి, అక్టోబర్ 7 : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సోమవారం సీపీ అంబర్ కిశోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న సీతారెడ్డి హనుమకొండ ట్రాఫిక్‌కు, ఇదే స్థానంలో పని చేస్తున్న ఎంఏ షుకూర్ ఇంతేజార్‌గంజ్‌కు, కమిషనరేట్‌కు అలాట్ అయిన వెంకటరత్నం మిల్స్‌కాలనీకి బదిలీ అయ్యారు.

ఆత్మకూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా దయాకర్

హసన్‌పర్తి, అక్టోబర్ 7 : ఆత్మకూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా మండలంలోని జయగిరికి చెందిన పల్లె దయాకర్‌ను నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టీపీసీసీ లీగల్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిమ్మని శేఖర్‌రావు, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మండలాధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, మార్కెట్ మాజీ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, ప్రభాకర్, అశోక్, పరమేశ్వర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

దయాకర్

కేయూసీ సీఐగా రవికుమార్

నయీంనగర్, అక్టోబర్ 7 : కేయూసీ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్ రవికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న సంజీవ్‌ను వరంగల్ ఎస్‌బీకి బదిలీ చేయగా ఆయన స్థానంలో రవి కుమార్ బాధ్యతలు చేపట్టారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న రవికుమార్

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 27మందికి జరిమానా

సుబేదారి, అక్టోబర్ 7 : హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 12మందికి జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షుకూర్ ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 14మందికి కోర్టు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం

నయీంనగర్, అక్టోబర్ 7 : వ్యక్తి అదృశ్యం అయిన ఘటన కేయూసీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్ల సింగారానికి చెందిన నల్ల ఐలేశ్వర్(68) ఈ నెల 6న ఉదయం కంటి పరీక్ష చేయించుకునేందుకు వెళ్లి ఇంత వరకు ఇంటికి తిరిగి రాలేదు. కుమారుడు శరత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే 9581626365లో సంప్రదించాలని కోరారు.

ఐలేశ్వర్(ఫైల్)

బీసీలంతా ఏకతాటిపైకి రావాలి

- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య
- హంటర్‌రోడ్డులో బీసీ ధూంధాం సన్నాహక సమావేశం

హనుమకొండ, అక్టోబర్ 7 : రాజ్యాధికారం, సామాజిక న్యాయం కోసం బీసీలంతా ఏకతాటిపైకి రావాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పిలుపునిచ్చారు. సోమవారం హంటర్‌రోడ్డులోని మాస్టర్జీ కళాశాలలో బీసీ జేఏసీ కన్వీనర్, కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ అధ్యక్షతన బీసీ ధూంధాం సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్రవర్ణాలు బీసీలను కులాల వారీగా చీల్చి వారి పీఠాలు కదలకుండా చూసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మనల్ని ఏకం కాకుండా విచ్ఛిన్న రాజకీయాలు, తాయిలాలు ఇస్తూ అడ్డుకుంటున్నారని, బీసీలు ఇప్పటికైనా వారి కుట్రలను అర్థం చేసుకోవాలని పిలుపునిచ్చారు. బీసీలకు రాజ్యాధికారం కావాలంటే బీసీ జనగణన ఒక్కటే పరిష్కార మార్గమన్నారు. సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ వారికి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలవుతున్నాయని చెప్పారు. దేశ వ్యాప్తంగా బీసీ కుల గణన చేయాలని డిమాండ్ చేశారు. బీసీ ఉద్యమం బలపడాలంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించాలన్నారు. వార్డు మెంబర్ నుంచి సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ వరకు బీసీలే కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అగ్రవర్ణాల పునాదులు గ్రామాల్లోని వాడల్లోనే ఉన్నాయని, వాటిని పెకిలించే పని మొదలు పెట్టాలన్నారు. మాజీ ఓఎస్ డీ, ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ మాట్లాడుతూ.. బీసీ ఉద్యమం పోరాటాల ఖిల్లా ఓరుగల్లు నుంచే ప్రారంభిద్దామన్నారు. దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని డాక్టర్ కాశీప్రసాద్ అన్నారు.

బీసీ జేఏసీ చైర్మన్‌గా సుందర్‌రాజు యాదవ్

బీసీ జేఏసీ చైర్మన్‌గా సుందర్ రాజ్ యాదవ్‌ను 14 మండలాల నుంచి వచ్చిన ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కో కన్వీనర్లుగా వంగ రవి, వేల్పుల సారంగపాణి, చీకటి ఆనంద్, సత్యనారాయణ ఎన్నికయ్యారు. 42 మందిని జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. పులి రజినీకాంత్, నరెండ్ల శ్రీధర్, వేణుమాధవ్ గౌడ్, మునిగాల సమ్మయ్య, కావటి స్వామి, ఆకారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బస్వరాజు సారయ్య

గోదామును పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్, పాలకవర్గం

సబ్ మార్కెట్ యార్డు పరిశీలన

శాయంపేట, అక్టోబర్ 7 : శాయంపేటలోని వ్యవసాయ మార్కెట్ సబ్ యార్డును పరకాల మార్కెట్ కమిటీ పాలకవర్గం సోమవారం సందర్శించింది. మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, స్థానిక మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారెపల్లి రవీందర్, డైరెక్టర్లు యార్డులోని గోదామును పరిశీలించారు. గోదాముపై రేకులు దెబ్బతినడం, ఫ్లోరింగ్ లేకపోవడంతో వైస్ చైర్మన్ రవీందర్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో దుబాసి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయి.. పట్టుదలతో చదివి..

వ్యవసాయశాఖ అధికారిగా ఉద్యోగం సాధించిన ఐనవోలు యువతి

ఐనవోలు, అక్టోబర్ 7: చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయింది. పెద్దనాన్న, బాబాయి, బాలవికాస, మా ఇల్లు ప్రజాదరణ సంస్థ సహకారంతో పెద్దయ్యాక పట్టుదలతో చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించింది. మండల కేంద్రానికి చెందిన బొల్లెపల్లి లక్ష్మి, వెంకటేశ్ దంపతులకు శ్రీజ, ఉష కూతుళ్లు. శ్రీజ 12వ ఏట తల్లిదండ్రులు మృతిచెందారు. పెద్దనాన్న రమేశ్, బాబాయి పరమేశ్ బాలవికాస సంస్థ సహకా రంతో బొల్లికుంట క్రాస్ వద్ద ఉన్న డాన్‌బోస్కో స్కూల్‌లో చేర్పించారు. బాలవికాస సహకారంతోనే ఇంటర్ పూర్తి చేసింది. మా ఇల్లు ప్రజాదరణ సంస్థ, కుటుంబ సభ్యుల సహకారంతో బీఎస్సీ ఎంట్రెన్స్ కోచింగ్ తీసుకొని సీఎంఆర్ కాలేజీలో సీటు సాధించింది. నాలుగేళ్ల పాటు మా ఇల్లు ప్రజాదరణ సంస్థ సహకారంతో బీఎస్సీ పూర్తి చేసింది. మండల వ్యవసాయ అధికారిగా (ఏఓ) ఉద్యోగ పరీక్షలో మల్టీజోన్ పరిధిలో 22వ ర్యాంక్ సాధించింది. ఆదివారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఏఓగా నియామక పత్రాన్ని అందుకుంది. ఆమె చెల్లి ఉష ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతోంది. తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపింది.


ఏఓ నియామక పత్రాన్ని చూపుతున్న శ్రీజ

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 7 : కాజీపేట మండలానికి చెందిన 29 మంది లబ్ధిదారులకు రూ.29,03,364 విలువైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అందించారు. మరో ఐదుగురికి రూ. 2,00,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. కార్పొరేటర్లు జక్కుల రవీందర్, మామిండ్ల రాజు, సయ్యద్ విజయారజాలి, మానస–రాంప్రసాద్, అబూబక్కర్, కుమారస్వామి, అశోక్, తహసీల్దార్ భావ్‌సింగ్ పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నాయిని